క్లుప్తంగా

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



బడంగ్‌పేటలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: మహిళా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేసినందుకు గురువారం బీజేపీ నాయకులు బడంగ్‌పేట మున్సిపల్ సర్కిల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కలిప్పించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు రామ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఐలయ్యయాదవ్, చిత్రం శ్రీను, జగన్, నిమ్మల సునిత, శ్రీశైలం, రామిడి మాధురి, గౌర రమాదేవి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు శాంతిమార్గంలో నడవాలి

ప్రధానోపాధ్యాయుడు బాబ్జీ



ప్రపంచ శాంతి దినోత్సవంలో శాంతి కపోతం ఆకృతిలో విద్యార్థులు

మీర్‌పేట: మీర్‌పేట నారాయణ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో గురువారం ప్రపంచ శాంతి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బాబ్జీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు శాంతి మార్గంలో నడవాలని, ఇదే ప్రపంచ శాంతికి మూలమన్నారు. అహింసా వాదంతో మనిషి మనుగడ సాగించాలన్నారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణలో శ్వేతవర్ణపు దుస్తుల్లో శాంతికపోతం ఆకృతిలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏఓ మాధవి, ఏడీ రాజేందర్, వీపీలు ధరణీ, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలో చేరుతున్న కుర్మల్‌గూడ వాసులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లో కుర్మల్‌గూడకు చెందిన పలువురు గురువారం విద్యాశాఖమంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధిలో దూసుకపోతుందని చెప్పారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి సబిత ఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామానికి చెందిన పాండుకు మంజూరైన రూ.60 వేల చెక్కును మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం అందజేశారు. అనారోగ్యానికి గురైన పాండు ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ గౌడ్ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించాడు. దీంతో మంజూరైన చెక్కును అతనికి అందజేశారు. మంత్రి సబితా రెడ్డితో పాటు దూడల శ్రీనివాస్ గౌడ్‌కు పాండు ధన్యవాదాలు తెలిపారు.

కృష్ణా జలాలతో గ్రామ దేవతలను అభిషేకించండి

తలకొండపల్లి: కృష్ణా జలాలతో గ్రామ దేవతలను అభిషేకించాలని జెడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. పాలమూర్- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలతో బీడు భూములను సస్యశామలం చేసేందుకు సీఎం కేసీఆర్ నార్లాపూర్ పంప్‌హౌజ్ వెటరన్‌ను ప్రారంభించారని తెలిపారు. దీంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాతో పాటు, వికారాబాద్, నల్గొండ జిల్లాల్లో సాగు భూములు సస్యశ్యామలమవుతాయని పేర్కొన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కృష్ణా జలాలతో నింపిన కలశ కుండలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాసురెడ్డి, ఎంపీపీ తిర్మణి నిర్మల, ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేశారు!



నెల రోజుల క్రితం తవ్విన హుడాకాంప్లెక్స్ రోడ్డు

- రోడ్డు పునరుద్ధరణకు మూడు నెలల క్రితం శంకుస్థాపన
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- అవస్థల్లో వాహనదారులు, స్థానికులు
- హుడాకాంప్లెక్స్‌లో నరకప్రాయంగా మారిన ప్రయాణం



రామాలయం ముందు ఛిద్రమైన రోడ్డు

హుడాకాంప్లెక్స్: అది నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం.. సాధారణ ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు ఎక్కువగా నివసిస్తుంటారు. వారి వాహనాల రాకపోకలతో నిత్యం ఆయా రోడ్లు రద్దీగా కనిపిస్తున్నాయి. ఏకధాటి వర్షాలకు తోడు భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో ఇక్కడి రోడ్లన్నీ గుంతలమయమై, ప్రమాదాలకు నెలవుగా మారాయి. కాలనీవాసుల అభ్యర్థన మేరకు ఇటీవల ప్రభుత్వం రోడ్ల పునరుద్దరణకు రూ.60 లక్షలు మంజూరు చేసింది. మూడు నెలల క్రితం మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన కూడా చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నెలన్నర క్రితం అప్పటికే ఉన్న పాత రోడ్డును పూర్తిగా తవ్వేశాడు. కానీ ఇప్పటి వరకు కొత్త పనులు ప్రారంభించలేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇతర కాలనీల్లోని వరద ఇక్కడ ముంచెత్తుతుండటంతో ఎక్కడ గుంత ఉందో..? ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో తెలియని దుస్థితి. పాదచారులు, టూవీలర్‌పై వెళ్లే ప్రయాణికులు బురదనీటిలో జారిపడుతున్నా.. పట్టించుకున్న నాథుడు లేడు. ఈ అంశంపై స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉంటూ.. రోడ్డు పనులను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే కాలనీలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన మహిళా భవన నిర్మాణం పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి.

అధికారుల నిర్లక్ష్యం వల్లే..



అధికారుల నిర్లక్ష్యంతో మేము ఇబ్బంది పడుతున్నాం. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. రోడ్డుపై మ్యాన్‌హోళ్లు తెరుచుకున్నాయి. ఏకధాటి వర్షాలు, వరదలకు రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. తక్షణమే పనులు పూర్తి చేయాలి.

– సురేష్, హుడాకాంప్లెక్స్

కిందపడిపోతున్నాం...



ఇంటి నుంచి రోడ్డుపైకి వెళ్లాలంటేనే భయమేస్తోంది. ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయి. వాహనాలు ఇంట్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఈ పనులను వెంటనే పూర్తి చేయాలి. ఇళ్లు, వాకిళ్లు అంతా బురదమయంగా మారుతోంది.

– భవ్య, హుడాకాలనీ

వారం రోజుల్లో పూర్తి చేస్తాం

రోడ్డు నిర్మాణం కోసం రూ.60 లక్షలు మంజూరయ్యాయి. నెల రోజుల క్రితమే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. డీబీఎం కూడా వేశారు. ఇతర కారణం చూపి కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలిపెట్టాడు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రశాంతి, ఏఈ

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కందుకూరులో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: అంగన్‌వాడీలు చేపట్టిన కలెక్టరేట్‌ల వద్ద నిరసనల్లో భాగంగా పోలీసులు వారిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా మహిళా కన్వీనర్ కవిత, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. నెలకు రూ.26వేల వేతనంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్లు, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకులు లక్ష్మి, శారద, నవీన, స్వప్న, స్వాతి, రాములమ్మ, భిక్ష, బొమ్మ, రాధా, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు రంగారెడ్డి'తో సస్యశ్యామలం



కందుకూరులో బొడ్రాయికి జలాభిషేకం చేసిన పూజలో జెడ్పీటీసీ

కందుకూరు: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో రంగారెడ్డి జిల్లా సస్యశ్యామల మవుతుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజక్టు కృష్ణా నీటితో గురువారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన బొడ్రాయికి అభిషేకం చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ధృడ సంకల్పంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారన్నారు. నీళ్లు లేక పాలమూరు రైతులు గతంలో వలసలు వెళ్లేవారని, నేడు రాష్ట్రం ఏర్పడిన తర్వాత వలసలు ఆగాయన్నారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రైతన్నలకు ఎంతో మేలు జరగనుందన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి సబితారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శమంతకమణి, ఎంపీడీఓ వెంకట్రాములు, ఉప సర్పంచ్ వెంకటయ్య, వార్డు సభ్యులు తాళ్ల కార్తీక్, కాసోజు పూజితప్రశాంత్‌చారి, ఎస్ రాంరెడ్డి, శ్రీశైలం, నర్సింహా, సులోచనమ్మ, కార్యదర్శి సురేందర్, జైపాల్‌రెడ్డి, కారోబార్లు సిద్ధు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో..

మాదాపూర్‌లో సర్పంచ్ మంద సాయిలు ఆధ్వర్యంలో కృష్ణా జలాలతో గ్రామంలోని బొడ్రాయికి అభిషేకించారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం తప్పనిసరి



సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కందుకూరు: గ్రామ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా సహకరించాలని బాచుపల్లి సర్పంచ్ యాలాల శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల పరిధిలోని బాచుపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. మంత్రి సబితారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొంతం ప్రేమలతబాల్‌రెడ్డి, మహిళా సంఘం నాయకురాలు తుమ్మ లూషమ్మ, రాంచంద్రారెడ్డి, రాములు, హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, కందుకూరి శ్రీనివాస్, ఎర్ర బావయ్య, కనకాచారి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ

కందుకూరు: కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీడీఓ వెంకట్రాములు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్వేక్షణ్ ప్రతిజ్ఞ చేయించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు ఇప్పటి నుంచే పారిశుధ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శమంతకమణి, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి చేయూత

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ రూ.1,00,116 (లక్ష నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం జెడ్పీటీసీ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ సులోచన సాయిలు, మాజీ ఎంపీటీసీ సక్రి, రాజా, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ

యాచారం: రాష్ట్ర మత్స్య కార్మిక శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పలు గ్రామాల మత్స్యపారిశ్రామిక సొసైటీలకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. మండలంలోని గుర్తింపు పొందిన 15 మత్స్యపారిశ్రామిక సొసైటీలకు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 4 లక్షల 90 వేల చేప పిల్లలను పంపిణీ చేశారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ఆధ్వర్యంలో సొసైటీలకు చేప పిల్లలను పంపిణీ చేశారు. పలు గ్రామాల ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు అండగా...

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం పరిధిలోని ప్రతి రైతు కుటుంబానికి అండగా ఉంటామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సుర్మాయిగూడ గ్రామానికి చెందిన సంఘం సభ్యుడు యాదయ్య జూన్ 19వ తేదీన మృతి చెందడంతో సంఘం తరపున మృతుడి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. సర్పంచులు సుధాకర్‌రెడ్డి, సుజాత, ఎంపీటీసీ సాయిగౌడ్, మేనేజర్ ఐలేశ్ యాదవ్ పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: గణనాథుడికి పంచె, జంధ్యం సమర్పిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

కొనసాగుతున్న గణనాథుని పూజలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి పద్మశాలి పాదుపు సంఘం అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో 21 అడుగుల పంచె, కండువా, జంధ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే గణనాథుడికి తాము సమర్పించామన్నారు.



మీర్‌పేట: ప్రశాంతిహిల్స్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గణనాథుని పూజలో ఆలయ చైర్మన్ మధుసూదన్‌రావు, కాలనీవాసులు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మురుగు కాలువ పనులు ప్రారంభిస్తున్న ఆచారి, రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో రూ.11 లక్షలతో చేపట్టే మురుగు కాలువ నిర్మాణ పనులను గురువారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, రాంపాల్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య, వార్డు కౌన్సిలర్ దివ్య, నాయకులు శ్రీకాంత్‌సింగ్, నర్సింహ, యాదమ్మ, కోటేశ్, శ్రీశైలం, బాలయ్య తదితరులు ఉన్నారు.

అవినీతిలో కాంగ్రెస్, బీజేపీ పోటీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: వారంటీ ముగిసిన కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ స్కీములతో ప్రజలను మోసం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకే తాను ముక్కలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు.గురువారం పార్టీ ముఖ్యనాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కర్ణాటకలో గతంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకుని పని చేసి ఎన్నికల్లో ఓటమిపాలైందని, అదే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు నెలలు తిరగ ముందే 50 శాతం కమీషన్లు తీసుకుని పని చేస్తోందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్కాముల పార్టీలుగా అభివర్ణించారు. అవినీతిలో ఈ రెండు పార్టీలు పోటీ పడుతుంటే.. బీఆర్‌ఎస్ మాత్రం అభివృద్ధి కోసం ఆరాటపడుతోందని అన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్నందునే తిరిగి మూడోసారి ప్రజలు పట్టం కట్టబోతున్నారని సుధీర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితమే నేడు పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి ఆమోదించారని అన్నారు. ఈ బిల్లును వచ్చే ఎన్నికల్లోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్ రావు, సాగర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, పద్మానాయక్, చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరావు, గజ్జల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానికేతరులకు కేటాయిస్తే ఉద్యమమే

- 'డబుల్' ఇచ్చే వరకు ఆందోళనలు నిర్వహిస్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు యాదవ్
- మన్సాన్‌పల్లి చౌరస్తాలో ఇళ్లకోసం ధర్నా



మన్సాన్‌పల్లి చౌరస్తాలో ఆందోళన చేస్తున్న శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: స్థానికేతరులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తే భారీ ఉద్యమం చేపడుతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో స్థానికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో నిర్మాణం చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లు స్థానికేతరులకు మంత్రి ఇస్తున్నారని ఈ విషయంపై తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్థానికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుండా ఎంఐఎంకి తొత్తుగా మారారన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ మహేశ్వరాన్ని మరో పాత బస్తీగా మార్చడానికి యత్నిస్తున్నారన్నారు. మహేశ్వరం నియోజకవర్గ వాసులకు కాకుండా మలక్‌పేట్, చార్మినార్, చంద్రాన్‌గుట్ట, యాకుత్‌పుర నియోజకవర్గాలకు చెందిన మైనార్టీ వర్గాలకు అధికంగా ఇళ్లను మంజూరు చేస్తూ, స్థానికులకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ఈ విషయంలో మంత్రి స్పందించి స్థానికులకే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ఆయన కోరారు. లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో స్థానికులను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అక్కడ ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీకార్యదర్శి మాసారం చంద్రయ్య గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదిష్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: సర్దార్‌నగర్ గ్రామంలో నిర్మించిన డబల్‌బెడ్రూంలను స్థానికులకు కేటాయించాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. గురువారం సర్దార్ నగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నిర్మించిన డబుల్ బెడ్రూంలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానికులకు ఇవ్వకుండా స్థానికేతరులకు కట్టబెడుతుందన్నారు. ఇళ్లను పూర్తిగా నగరానికి చెందిన వారికి పంపిణీ చేయడం బాధాకరమన్నారు. స్థానికంగా ఉన్న నిరుపేదలు దరఖాస్తు చేసుకున్న వారికి పంపిణీ చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్థానికులకే పంపిణీ చేయాలని ఆయన కోరారు. మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధు మోహన్, పార్టీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్ రాజు, సుధాకర్, మహేందర్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.